RNI.NO. TGBIL/26/A0701

# తొలిప్రభ

తెలుగు దినపత్రిక

WWW.toliprabha.com

హైదరాబాద్ | శుక్రవారం 26.06.2026 | సంపుటి:1 | సంచిక:109 | పేజీలు:4 | వెల:రూ.5




### మీరు ఇవ్వరు విద్యార్థుల నుంచి

# వసూలు చేసుకోనివ్వరా ?

- జీవో 9పై మధ్యంతర స్టే, ఫీజు వసూలుపై వారం వరకు హైకోర్టు అడ్డుకట్ట
- హైకోర్టులో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట
- బకాయిలు లేకపోతే కళాశాలలు ఎలా నడుస్తాయి, ప్రభుత్వాన్ని ప్రశ్నించిన హైకోర్టు ధర్మాసనం
- ఆగస్టు 15లోపు బాకాయిలు క్లియర్ చేస్తాం : కోర్టుకు తెలిపిన ప్రభుత్వ న్యాయవాది
- ప్రభుత్వం-యాజమాన్యాల మధ్య నలిగిపోతున్నాం అంటూ ఇంప్లీడ్ పిటిషన్ దాఖలు చేసిన విద్యార్థులు



**తెలంగాణ హైకోర్టులో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలకు స్వల్ప ఊరట లభించింది. ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9లోని కొన్ని నిబంధనలపై హైకోర్టు స్టే విధించింది. విద్యార్థుల నుంచి ఫీజు వసూలు చేయవద్దని ప్రభుత్వం ఇచ్చిన జీవోపై వచ్చే మంగళవారం వరకు స్టే విధిస్తూ హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.**

**తొలిప్రభ , తెలంగాణ బ్యూరో**

ప్రైవేట్ కళాశాలలు వేసిన పిటిషన్లపై హైకోర్టు ఇవాళ కూడా విచారణ జరిపింది. బకాయిలు రాకపోతే కళాశాలలు ఎలా నడుపుతారని ధర్మాసనం ప్రభుత్వ న్యాయవాదిని ప్రశ్నించింది. మీరు బకాయిలు చెల్లించరు, విద్యార్థుల నుంచి వసూలు చేసుకోనివ్వరా అని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ఎంత బడ్జెట్ కేటాయించారు? బకాయిలు ఎందుకు విడుదల చేయలేదు? పెండింగ్ బకాయిలు ఎప్పటిలోగా చెల్లిస్తారని ప్రశ్నల వర్షం కురిపించింది. ఆగస్టు 15లోపు ఫీజు బాకాయిలన్నీ క్లియర్ అవుతాయని ప్రభుత్వ న్యాయవాది కోర్టుకు విన్నవించారు. అయితే ఆగస్టు 15నే పిటిషన్లు విత్‌డ్రా చేసుకుంటామని ప్రైవేట్ కళాశాలల

మిగతా 2లో




# ఉద్యోగులకు భీమ..

# కుటుంబానికి ధీమా

- ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం
- ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ బీమా సౌకర్యం
- ప్రతి ఉద్యోగికి రూ.1 కోటి ప్రమాద బీమా అమలు
- 16 బ్యాంకులతో ప్రమాద బీమా ఒప్పందాలు కుదుర్చుకున్న ప్రభుత్వం
- ఫస్టు తారీఖున ఉద్యోగులకు జీతాలు ఇస్తున్నామన్న సీఎం

**ప్రభుత్వ, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ బీమా సౌకర్యం కల్పిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలుపడంలో కృషి చేస్తున్న ఉద్యోగులకు ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్లోని రవీంద్ర భారతిలో ఉద్యోగులు, పెన్షనర్ల ప్రమాద బీమా పథకానికి సీఎం రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు.**

**తొలిప్రభ , తెలంగాణ బ్యూరో**

రేవంత్ రెడ్డి సమక్షంలో 16 బ్యాంకులతో ప్రమాద బీమా ఒప్పందాలు కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి ఉద్యోగికి రూ.కోటి బీమా సదుపాయం : ఉద్యోగులకు ప్రమాద బీమాను మొదట సింగరేణిలో ప్రారంభించామని, సింగరేణిలో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఇప్పటికే రూ.కోటి చొప్పున చెక్కులు అందజేశామని సీఎం గుర్తు చేశారు. పోయిన ప్రాణాన్ని తెచ్చివ్వలేము కానీ

మిగతా 2లో



### ఎమ్మార్వో సుచరిత ఇంట్లో మరోసారి ఏసీబీ సోదాలు

- భారీగా అక్రమ ఆస్తుల గుర్తింపు
- రూ.5 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు గుర్తింపు, స్వాధీనం


2



### అంతర్జాతీయ విమానాల్లో 'హబ్ అండ్ స్పోక్' మోడల్

- 'ప్రపంచ అవకాశాలకు భారత్ మరింత చేరువ
- వారణాసి నుంచి తొలి విమాన సేవల ప్రారంభం

2



### పాస్‌పోర్ట్ దరఖాస్తు రుసుము పెంపు జులై 1నుంచి అమలు

- సాధారణ, తత్కాల్ దరఖాస్తులకు పెరిగిన ధరలు
- పోగొట్టుకున్న, దెబ్బతిన్న పాస్‌పోర్ట్‌లకు అధిక ఫీజు
- మైనర్లకు కొనసాగుతున్న తక్కువ రుసుములు
- పాస్‌పోర్ట్ పౌరసత్వ రుజువు కాదని ప్రభుత్వ వివరణ

**తొలిప్రభ , తెలంగాణ బ్యూరో**

పాస్‌పోర్ట్ దరఖాస్తు రుసుములను కేంద్ర ప్రభుత్వం సవరించింది. దీంతో జులై 1 నుంచి పాస్‌పోర్ట్ ఫీజులు పెరగనున్నాయి. సాధారణ పాస్‌పోర్ట్ కోసం కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి లేదా 36 పేజీల పాస్‌పోర్ట్‌ను రీఇష్యూ చేయించుకునే వారికి ఇకపై ఫీజు రూ.2,500 కానుంది. అలాగే 60 పేజీల పాస్‌పోర్ట్ కావాలనుకునే అభ్యర్థులు రూ.3,500 చెల్లించాల్సి

మిగతా 2లో




### ఈసారి పంచముఖ రూపంలో

# ఖైరతాబాద్ గణేశుడు

### విగ్రహ నమూనా విడుదల

- ఉత్సవాలకు సిద్ధమవుతున్న 69 అడుగుల భారీ లంబోదరుడు
- కాళీమాత, సోమనాథ్ తో ప్రత్యేక అలంకరణ
- శిల్పి రాజేంద్రన్ తయారు చేస్తున్న విగ్రహం
- 72 ఏళ్లు పూర్తి చేసుకోనున్న ఖైరతాబాద్ బడా గణేశుడి ఉత్సవాలు

**తొలిప్రభ , హైదరాబాద్**

త్వరలో వినాయక చవితి సందడి మొదలు కానుంది. దేశమంతా గణపతి విగ్రహాల తయారీ మొదలైంది. తెలుగురాష్ట్రాల్లో ఖైరతాబాద్ విఘ్నేశునిది ప్రత్యేక స్థానం. ప్రతిసారీ లంబోదరుడు అత్యంత ఎత్తైన, విశిష్ట రూపంలో దర్శనమిస్తాడు. ఈసారి బడా గణేశుడు 69 అడుగుల్లో 'పంచముఖ సంకటహర మహాగణపతి'గా దర్శనమివ్వనున్నారు. ఈ మేరకు ఖైరతాబాద్ ఉత్సవ కమిటీ నమూనా చిత్రం విడుదల చేసింది. విగ్రహానికి ఓవైపు కాళీమాత, మరోవైపు సోమనాథ జ్యోతిర్లింగం ప్రతిమలను ఏర్పాటు చేయనున్నారు. ఈసారి కూడా ఈ భారీ విగ్రహాన్ని శిల్పి రాజేంద్రన్ సిద్ధం చేయనున్నారు. ఇవాళ విగ్రహ ఏర్పాటు కర్రపూజ నిర్వహించారు. సెప్టెంబర్ 14న చవితి పండగ జరగనుండగా, ఈ ఏడాదితో ఖైరతాబాద్ భారీ లంబోదరుడి ఉత్సవాలకు 72 ఏళ్లు పూర్తికానున్నాయి.

### ప్రాణమిచ్చైన తెలంగాణ

# స్థానికతపై పోరాడుతాం

### హైకోర్టు తీర్పుపై సుప్రీంకు వెళ్లి న్యాయ పోరాటం చేయాలని ప్రభుత్వానికి డిమాండ్

- జీవో 29 రద్దు చేసి జీవో 55 తీసుకురావాలి
- లోకల్ సర్టిఫికెట్ జారీలో అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి
- 20 వేల కానిస్టేబుల్ పోస్టులతో నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలి
- స్థానికతకు 15 ఏళ్లు ఉండాలి, ముల్కీ నిబంధనలు అమలు చేయాలి
- సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమావేశంలో కవిత పిలుపు

**తొలిప్రభ , హైదరాబాద్**

తెలంగాణ స్థానికత హక్కుల విషయంలో ప్రాణమిచ్చైనా సరే పోరాడి కాపాడుకుంటామని తెలంగాణ రక్షణ సేనసారథి కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో 'తెలంగాణ స్థానికత సవాళ్లు' అంశంపై నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆమె ముగింపు ప్రసంగం చేశారు. స్థానికత అంశంపై నాలుగేళ్ల

మిగతా 2లో



# ఎల్పీజీ సరఫరాపై ఆంక్షలు ఎత్తివేత



- కుదుటపడ్డ పశ్చిమాసియా ఉద్రిక్త పరిస్థితులు
- అమెరికా-ఇరాన్ తాత్కాలిక ఒప్పందం చర్చలకు సానుకూల వాతావరణం
- తొలగిన ఇంధన సరఫరా అంతరాయాలు
- కమర్షియల్ ఎల్పీజీపై ఉన్న పరిమితులు ఎత్తివేత
- గృహ వినియోగదారులకు ఇబ్బంది లేకుండా చర్యలు

2

## ప్రాణమిచ్చైన తెలంగాణ

# స్థానికతపై పోరాడుతాం



తరువాయి భాగం

క్రితం ఇదే కోర్టు పూర్తి విరుద్ధంగా తీర్పు ఇచ్చిందని కవిత గుర్తు చేశారు. "ఒకే అంశంపై మూడు, నాలుగేళ్లకొకసారి తీర్పులు మారకుండా కోర్టులకు ఒకే విధానం ఉండాలి. నాలుగేళ్లు ఇక్కడ చదివితే లోకల్ అని చెప్పిన కోర్టే, ఇప్పుడు మళ్లీ విరుద్ధంగా తీర్పు ఇచ్చింది" అని అన్నారు.

హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సుప్రీంకోర్టులో మంచి అడ్వకేట్లతో రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తరపున వాదించిన లాయర్ మునుపటి తీర్పు అంశాన్ని కోర్టు దృష్టికి తీసుకెళ్లి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని విమర్శించారు. ప్రభుత్వం ముందుకు రాకపోతే నిరుద్యోగులతో కలిసి తామే పిటిషన్ వేస్తామని హెచ్చరించారు.

**జీవో 29 రద్దు చేయాలి**

స్థానికత విషయంలో మళ్లీ ముల్కీ నిబంధనలు అమల్లోకి రావాలని, 15 ఏళ్లు ఉంటేనే స్థానికులుగా పరిగణించాలని కవిత డిమాండ్ చేశారు. 371డి, ప్రెసిడెన్షియల్ ఆర్డర్ ఉన్నా స్థానికేతరులు పెద్ద ఎత్తున వస్తున్నారంటే అది జీవో 29 వల్లేనని అన్నారు. జీవో 29 రద్దు చేసి పాత జీవో 55 తీసుకురావాలని, అప్పుడే తెలంగాణ ఫస్ట్ అనే భావన వస్తుందని చెప్పారు. జీవో 29 వల్ల ఎస్సీ, ఎస్టీ, బీసీలకూ నష్టం జరుగుతోందని పేర్కొన్నారు.

జీవో 29 రద్దు చేస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. "కాంగ్రెస్ అంటేనే కరెప్షన్, కరెప్షన్ అంటేనే కాంగ్రెస్" అని విమర్శించారు. తాము అధికారంలోకి వస్తే కాంగ్రెస్ హయాంలో ఇచ్చిన ఉద్యోగాలపై న్యాయ విచారణ జరిపిస్తామని ప్రకటించారు.

**లోకల్ సర్టిఫికెట్ జారీలో నిర్లక్ష్యం**

లోకల్ సర్టిఫికెట్ ఇచ్చే విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనివల్ల అభ్యర్థులకు తీవ్ర నష్టం జరుగుతోందని కవిత ఆవేదన వ్యక్తం చేశారు. గన్ లైసెన్స్ ఇచ్చేప్పుడు ఎంత కఠినంగా ఎంక్వైరీ చేస్తారో, లోకల్ సర్టిఫికెట్ విషయంలోనూ అలాగే చేయాలన్నారు.

కానిస్టేబుల్ ఉద్యోగాలకు 20 వేల పోస్టులతో నోటిఫికేషన్ వేయాలని డిమాండ్ చేశారు. 15 లక్షల మంది నిరుద్యోగులు ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్నారని, పెద్ద సంఖ్యలో పోస్టులు భర్తీ చేయాలన్నారు. జీవో 46 వల్ల అభ్యర్థులకు నష్టం జరుగుతోందని, దాన్ని సరిచేసి నోటిఫికేషన్ ఇవ్వాలని కోరారు. ఏజ్ రిలాక్సేషన్‌ను గతంలో ఉన్నట్లే కొనసాగించాలన్నారు.

ఉర్దూ డీఎస్సీ, ఆదివాసీల కోసం ప్రత్యేక డీఎస్సీ వేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటికీ అమలు చేయలేదని విమర్శించారు. ఆదివాసీ, ఎస్టీల హక్కుల కోసం జాగృతి నుంచి ప్రత్యేక వింగ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సింగరేణిలో ఆదివాసీ, ఎస్టీ బిడ్డలకు రాజ్యాంగబద్ధ హక్కుల మేరకు ఉద్యోగాలు ఇప్పించినట్లు చెప్పారు.

**సమావేశం తీర్మానాలు**

స్థానికత అంశంలో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టులో మంచి అడ్వకేట్లతో ప్రభుత్వమే సవాల్ చేయాలి. రాష్ట్రపతి ఉత్తర్వులు 2018 త్వరితగతిన అమలు చేసి నియామకాలు చేపట్టాలి. తెలంగాణ ఫస్ట్ అనే భావనతో జీవో 29 రద్దు చేసి జీవో 55 తీసుకురావాలి. కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన అన్ని నియామకాలపై న్యాయ విచారణ జరపాలి. స్థానికత 4 ఏళ్లు కాకుండా ముల్కీ నిబంధనల మాదిరిగా 15 ఏళ్లు ఉండేలా ప్రతిపాదన చేయాలి.

"మేధావులు మాట్లాడకపోయినా యువ తెలంగాణ మొత్తం ఈ పోరాటంలో ఉంది. మీ ఆధ్వర్యంలోనే మనమంతా పోరాడి రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్దాం" అని కవిత పిలుపునిచ్చారు. సమావేశంలో రోస్టర్ విధానం ద్వారా అందరికీ లాభం చేకూరేలా చర్యలు తీసుకోవాలని కూడా తీర్మానించారు.

## మీరు ఇవ్వరు విద్యార్థుల నుంచి

# వసూలు చేసుకోనివ్వరా ?

తరువాయి భాగం

యాజమాన్యాలు సమాధానమిచ్చాయి. మధ్యలో మేం నలిగిపోతున్నాం : ఇదే విషయంలో విద్యార్థులు కూడా ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. ప్రభుత్వం, యాజమాన్యాల మధ్య విద్యార్థులు నలిగిపోతున్నారని, వారి తరపు న్యాయవాది కోర్టుకు విన్నవించారు. ఈ బకాయిల ద్వారా విద్యార్థులు నష్టపోకుండా చూడాలని ధర్మాసనానికి విజ్ఞప్తి చేశారు. కోర్టు ఆదేశాలు ఈ ఏడాది చేరిన విద్యార్థులకే వర్తించేలా చూడాలని కూడా విన్నవించారు. వాదనలు విన్న ధర్మాసనం, జీవో 9లోని కొన్ని నిబంధనలపై వచ్చే మంగళవారం వరకు స్టే విధించింది. తదుపరి విచారణను అదే రోజుకు వాయిదా వేసింది.

## యువతకు క్షమాపణ చెప్పి

# వెంటనే రాజీనామా చేయాలి

తొలిప్రభ , ఢిల్లీ

కేంద్ర ప్రభుత్వ తీరుపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. దేశవ్యాప్తంగా పదేపదే ప్రశ్నాపత్రాల లీకేజీలు జరుగుతున్నాయని, విద్యా వ్యవస్థలోని లోపాల కారణంగా కోట్లాది మంది యువత భవిష్యత్తు ప్రమాదంలో పడిందని ఆరోపించారు. తమ హక్కులు, నిష్పక్షపాత పరీక్షలు కోసం గళం విప్పుతున్న విద్యార్థులను ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుంటోందని మండిపడ్డారు. అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న ప్రభుత్వం, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాల్సిందిపోయి, బదులుగా వారినే విమర్శిస్తోందని అన్నారు. సురక్షితమైన భవిష్యత్తు కోసం నిరసనలు తెలుపుతున్న విద్యార్థులను విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'ఉగ్రవాదులు'గా ముద్ర వేసే స్థాయికి వెళ్లడం బాధాకరమన్నారు.

అయితే, తమ భవిష్యత్తు కోసం నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులను అవమానించేలా వ్యాఖ్యలు చేసినందుకుగానూ, దేశ యువతకు వెంటనే క్షమాపణ చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గురువారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్'లో ఆయన పోస్టు చేశారు. ఎవరి వైఫల్యాల వల్ల ఇన్ని పేపర్ లీక్‌లు జరిగాయో, ఎవరి హయాంలో 20 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారో, లక్షలాది మంది యువత భవిష్యత్తు అంధకారంలోకి వెళ్లిందో ఆలోచించండి. అలాంటి వారే ఇప్పుడు బాధిత విద్యార్థులను, వారి తరపున మాట్లాడుతున్న వారిని 'ఉగ్రవాదులు' అని ముద్ర వేస్తున్నారు. విద్యార్థులను అవమానించినందుకు గానూ దేశంలోని కోట్లాది మంది యువతకు వెంటనే క్షమాపణ చెప్పాలి.

## ఉద్యోగులకు భీమ..

# కుటుంబానికి ధీమా

తరువాయి భాగం


ఆర్థికంగా ఆదుకుని బాసటగా నిలవాలని తెలిపారు. సంస్థ లేదా ప్రభుత్వం కోసం కష్టపడిన వారికి అండగా ఉండాల్సిన బాధ్యత యజమానిపై ఉందని స్పష్టం చేశారు. సింగరేణిలాగే రాష్ట్రంలో ప్రతి ఉద్యోగికి రూ.కోటి బీమా సదుపాయం కల్పించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కని కోరానని పేర్కొన్నారు.రేవంతన్న అని పిలిపించుకోవటమే ఇష్టం : తాను గుంపుమేస్త్రీనేనని, అలా చాలామంది తనను అవహేళన చేశారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అందరూ హేళన చేసినా, బాధపడనని, ఈ గుంపంతా తనదేనని తేల్చి చెప్పారు. తన గుంపులో ఉన్నవారంతా చక్కగా తన పనిచేస్తుంటారని కొనియాడారు. కొందరు తాము దొరలమని, గడీలు ఉన్నాయని గొప్పలు చెప్పుకుంటారని ఎద్దేవా చేశారు. తనకు మాత్రం రేవంతన్న అని పిలిపించుకోవటమే ఇష్టమని స్పష్టం చేశారు. ఇష్టం, ప్రేమ ఉంటేనే సీఎంను కూడా అన్నా అని పిలుస్తారని తెలిపారు.

**ఫస్టు తారీఖున జీతాలు ఇస్తున్నాం :**

ఐదేళ్లకోసారి పాలకులు మారినా ప్రభుత్వ ఉద్యోగులు మారరని అన్నారు. గతంలో పదేళ్లపాటు ఉద్యోగులకు 10 తారీఖులోపు జీతం వచ్చేది కాదని, గత ప్రభుత్వం ఉద్యోగులకు జీతాలను కూడా వాయిదాలుగా ఇచ్చిందని ఆరోపించారు. ప్రభుత్వం, ప్రజల కోసం కష్టపడేవారికి సకాలంలో జీతాలు ఇవ్వాలని నిర్ణయించుకున్నామని, ఆర్థికంగా ఎన్ని ఒడుదొడుకులు ఉన్నా ఫస్టు తారీఖున జీతాలు ఇస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి రాగానే నెలకు రూ.వెయ్యి కోట్ల చొప్పున బెనిఫిట్స్ చెల్లించాల్సిన పరిస్థితి ఏర్పడిందని వెల్లడించారు.

# ఎల్పీజీ సరఫరాపై ఆంక్షలు ఎత్తివేత

తొలిప్రభ , తెలంగాణ బ్యూరో



పశ్చిమాసియాలో కొంత కాలంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్నాయి. అమెరికా ఇరాన్ తాత్కాలిక ఒప్పందం కుదుర్చుకోవడం, పూర్తి స్థాయిలో పరిష్కారం దిశగా చర్చలు సానుకూలంగా సాగిస్తుండటం ఇందుకు కారణం. కొద్ది రోజుల కిందట ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన సరఫరా అంతరాయాలు నెలకొనగా ఇప్పుడు ఇది కూడా సాధారణ స్థితికి వస్తోంది. దీంతో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హోటల్స్, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య సంస్థలు, పరిశ్రమలకు సరఫరా చేసే కమర్షియల్ ఎల్‌పీజీపై విధించిన అన్ని పరిమితుల్ని ఎత్తివేస్తున్నట్లు ప్రకటించింది. యుద్ధ సంక్షోభానికి ముందు ఉన్న స్థాయికి సరఫరాల్ని పునరుద్ధరించింది.

పెట్రోలియం, సహజ వాయు మంత్రిత్వ శాఖ ఈ మేరకు గురువారం రోజు ఒక ప్రకటన విడుదల చేసింది. దేశీయ ఎల్పీజీ ఉత్పత్తి పెరగడం సహా ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకుంటున్న ఎల్పీజీ ట్యాంకర్లు వస్తుండటం వల్ల సరఫరా గణనీయంగా మెరుగుపడిందని తెలిపింది. దీంతో వాణిజ్య ఎల్పీజీ సరఫరాల్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించినట్లు వెల్లడించింది.భారత్‌కు అవసరమైన వంట గ్యాస్‌లో దాదాపు 90 శాతం పశ్చిమాసియా నుంచే దిగుమతి అవుతుంది. అయితే ఇరాన్ ఇజ్రాయెల్ అమెరికా ఉద్రిక్తతలు, హోర్ముజ్ జలసంధి చుట్టూ నెలకొన్న అనిశ్చితి కారణంగా భారత ఎల్పీజీ దిగుమతులపై ప్రభావం పడింది. ఈ క్రమంలోనే దేశీయంగా గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు కేంద్రం అప్పటికప్పుడు అత్యవసర చర్యలు చేపట్టింది. దీంట్లో భాగంగానే హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర పరిశ్రమలకు సరఫరా చేసే కమర్షియల్ ఎల్పీజీపై పరిమితులు విధించింది. అందుబాటులో ఉన్న నిల్వల్ని గృహ వినియోగదారులకు మళ్లించింది. ఇప్పుడు పరిస్థితులు కుదుటపడగా ఆ ఆంక్షల్ని ఎత్తివేస్తూ సాధారణ స్థితికి చేర్చినట్లు ప్రకటించింది




## పాస్‌పోర్ట్ దరఖాస్తు రుసుము పెంపు

# జులై 1నుంచి అమలు

తరువాయి భాగం

ఉంటుంది. ఈ ఫీజుల పెంపు తత్కాల్ పథకం కింద దరఖాస్తు చేసుకునే వారికి కూడా వర్తిస్తుంది. తత్కాల్ కింద 36 పేజీల పాస్‌పోర్ట్ ధర రూ.5000 కాగా, 60 పేజీల పాస్‌పోర్ట్ ధర రూ.6000 నిర్ణయించారు. సవరించిన నిబంధనల ప్రకారం పోగొట్టుకున్న, చోరీకి గురైన లేదా పాడైపోయిన పాస్‌పోర్ట్‌ల స్థానంలో కొత్తవి పొందేందుకు అయ్యే ఖర్చును కూడా పెంచారు. అలాగే, తత్కాల్ కేటగిరీ కింద, పోగొట్టుకున్న లేదా దెబ్బతిన్న 36 పేజీల పాస్‌పోర్ట్‌ను మార్చుకోవడానికి ఫీజు రూ.7,500గా నిర్ణయించారు. 60 పేజీల పాస్‌పోర్ట్ కోసం దరఖాస్తుదారులు రూ.8,500 చెల్లించాలి. కేంద్ర ప్రభుత్వం మైనర్లకు మాత్రం తక్కువ ఫీజులనే కొనసాగించింది. మైనర్ల కోసం కొత్త పాస్‌పోర్ట్ లేదా 36 పేజీల పాస్‌పోర్ట్ రీఇష్యూ ధర రూ.1,750 గా ఉంటుంది. తత్కాల్ స్కీమ్ కింద ఈ ఫీజును రూ.4,250 గా స్థిరపరిచారు. ఇక, చివరిసారిగా, పాస్‌పోర్ట్ ఫీజుల్లో సవరణ 2012లో జరిగింది. అప్పటి ప్రభుత్వం ప్రామాణిక 36పేజీల పాస్‌పోర్ట్ ఫీజును రూ.1,000 నుంచి రూ.1,500కి, అలాగే, తత్కాల్ ఫీజును రూ. 2,500 నుంచి రూ. 3,500కి పెంచింది.

**పాస్పోర్ట్ గుర్తింపు పత్రాల్లో భాగమే**

ఇదిలా ఉండగా, ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ(ఎస్ఐఆర్) ప్రక్రియలో భాగంగా, ఓటర్లు తమ అర్హతను నిరూపించుకోవడానికి సమర్పించాల్సిన 12 గుర్తింపు పత్రాల్లో భారతీయ పాస్‌పోర్ట్ కూడా ఒకటని ఎన్నికల సంఘం(ఈసీ) పేర్కొంది. బిహార్, అసోం ప్రత్యేక సవరణలతో పాటు, ఆ తర్వాత జరిగిన అన్ని ఓటర్ల జాబితా సవరణల్లో కూడా పాస్‌పోర్ట్‌ను ఒకటిగా ఆమోదించారు. ఓటరు జాబితాలో ఒక వ్యక్తి అర్హతను నిర్ణయించడానికి, దరఖాస్తుదారు సమర్పించిన ఈ పత్రాలను ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి (ఈఆర్ఓ) పరిశీలిస్తారని ఈసీ వెల్లడించింది. "గుర్తింపును నిర్ధరించే పత్రాల్లో పాస్‌పోర్ట్ ఒకటిగా గతంలోనూ, ఇప్పుడూ కొనసాగుతోంది. అందులో ఎలాంటి మార్పు లేదు" అని ఓ అధికారి చెప్పారు.

**'పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి ప్రూఫ్ కాదు'**

పాస్‌పోర్ట్ చట్టం 1967 ప్రకారం 'పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వానికి నిరూపణ కాదు' అని ఇటీవల విదేశాంగ మంత్రిత్వ శాఖ (MEA) పేర్కొనడంతో దేశవ్యాప్తంగా ఒక వివాదం తలెత్తింది. ఈ నేపథ్యంలో వ్యక్తమైన సందేహాలపై స్పందించిన ఈసీ అధికారులు గురువారం ఈ కీలక వివరణ ఇచ్చారు. కాగా, పాస్‌పోర్ట్ అనేది పౌరసత్వాన్ని నిర్ధరించే పత్రం కాదని కేంద్ర విదేశాంగశాఖ చేసిన ప్రకటనపై ప్రతిపక్షాల నుంచి విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో మంత్రిత్వ శాఖ స్పందిస్తూ, పాస్‌పోర్ట్‌ను ఎప్పుడూ పౌరసత్వానికి ప్రూఫ్‌గా చూడలేదని స్పష్టం చేసింది. గత 12 ఏళ్లలో అటువంటి నిర్ణయం ఏదీ తీసుకోలేదని పేర్కొంది. పౌరులు కాని వారికి కూడా పాస్‌పోర్ట్‌ను జారీ చేసే వెసులుబాటు చట్టంలో ఉందని వెల్లడించింది. అయితే, అది ఉందంటే పౌరసత్వాన్ని నిర్ధరించినట్లు కాదని 2013లో బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తుచేసింది. పాస్‌పోర్ట్‌లు ప్రధానంగా అంతర్జాతీయ ప్రయాణాలను సులభతరం చేయడానికి ప్రభుత్వం జారీ చేసే ప్రయాణ పత్రాలు మాత్రమేనని తెలిపింది. భారతీయ పాస్‌పోర్ట్‌లు ప్రభుత్వ ఆస్తిగా పరిగణిస్తారు, కాబట్టి, ప్రభుత్వం కోరినప్పుడు వాటిని తప్పనిసరిగా తిరిగి అప్పగించాల్సి ఉంటుందని చెప్పింది.

## అంతర్జాతీయ విమానాల్లో

# 'హబ్ అండ్ స్పోక్' మోడల్

తొలిప్రభ , ఢిల్లీ

దేశాన్ని ప్రపంచ విమానయాన కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ప్రారంభించిన 'హబ్ అండ్ స్పోక్' మోడల్ సేవలకు కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కే రామ్మోహన్ నాయుడు శ్రీకారం చుట్టారు. ఈ మోడల్ కింద తొలి విమాన సేవలను గురువారం ఉత్తర్రప్రదేశ్లోని వారణాసి నుంచి ప్రారంభించారు. వచ్చే ఆరు వారాల్లో మరో ఆరు భారతీయ నగరాలకు విమాన సేవలను విస్తరించనున్నట్లు ప్రకటించారు. దీనిపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పందిస్తూ, 'హబ్ అండ్ స్పోక్' మోడల్ దేశంలోని ప్రాంతాలను ప్రపంచ అవకాశాలకు మరింత చేరువ చేస్తుందని అన్నారు. ఈ విధానం వల్ల ప్రయాణికుల ప్రయాణ సమయం తగ్గడమే కాకుండా, చిన్న నగరాలకు కూడా ప్రపంచ స్థాయి అనుసంధానం లభిస్తుందని పేర్కొన్నారు.

**'విమానాశ్రయాలపై ఒత్తిడి తగ్గుతుంది'**

ఈ మోడల్ వల్ల ఇప్పటికే ఉన్న మౌలిక సదుపాయాలను మరింత సమర్థంగా వినియోగించుకునే అవకాశం ఉంటుందని ప్రధాని మోదీ చెప్పారు. విమానాల వినియోగ సామర్థ్యం పెరగడంతో పాటు, ప్రధాన విమానాశ్రయాలపై ఉన్న రద్దీ కూడా తగ్గుతుందని పేర్కొన్నారు. అత్యంత ముఖ్యంగా, దేశంలోని మరిన్ని ప్రాంతాలను ప్రపంచ అవకాశాలకు దగ్గర చేస్తుందని ప్రధాని తన సందేశంలో పేర్కొన్నారు.

## ఎమ్మార్వో సుచరిత

# ఇంట్లో మరోసారి ఏసీబీ సోదాలు

- **భారీగా అక్రమ ఆస్తుల గుర్తింపు**
- **రూ.5 కోట్లకు పైగా అక్రమ ఆస్తులు గుర్తింపు, స్వాధీనం**
- **నాల కన్వర్షన్ కోసం రూ.30 లక్షలు డిమాండ్, రూ.2 లక్షలు లంచం తీసుకున్న కేసు**



తొలిప్రభ , హైదరాబాద్

గత నెల రూ. 2లక్షల లంచం తీసుకుంటూ ఏసీబీ కి పట్టుబడ్డ శామీర్‌పేట తహసీల్దార్ సుచరిత ఇంట్లో గురువారం ఏసీబీ అధికారులు మరోసారి సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో భారీగా అక్రమ ఆస్తులున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. నాల కన్వర్షన్ కోసం రూ.30 లక్షలు డిమాండ్ చేసి రూ.2 లక్షలు లంచం తీసుకున్న సుచరిత ప్రస్తుతం సస్పెన్షన్‌కు గురై ఏసీబీ కేసులో జైల్లో ఉన్నారు. హైదరాబాదులోని ఆమె నివాసాలతో పాటు వారి బంధువుల నివాసాల్లో ఏసీబీ అధికారులు సోదాలు చేశారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంటలో 2.17 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్, కీసర, ఖానాపేట్ లో మూడు ప్లాట్లు ఉన్నట్లు గుర్తించారు.రూ.12 లక్షల నగదు, రెండు కార్లు, కోటి 20 లక్షల విలువ గల బంగారు, వెండి ఆభరణాలు, బ్యాంక్‌బ్యాలెన్స్ 38 లక్షలు ఉన్నట్లు గుర్తించారు. వీటి మొత్తం విలువ రూ.5 కోట్లకు పైగా ఉంటుందని, మార్కెట్లో అనేక రెట్లు ఉంటాయని ఏసీబీ అధికారులు వెల్లడించారు.



కడ్తాల్: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న దశరథ్ నాయక్

# తెలంగాణ లంబాడీలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ క్షమాపణ చెప్పాలి

**లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు దశరథ్ నాయక్**

**తొలిప్రభ, కడ్తాల్ :**

తెలంగాణ లంబాడీలకు ద్రోహం చేసిన కాంగ్రెస్ పార్టీ క్షమాపన చెప్పాలని కడ్తాల్ మాజీ జెడ్పిటిసి, లంబాడి హక్కుల రాష్ట్ర పోరాట సమితి ఉపాధ్యక్షుడు జర్పుల దశరథ్ నాయక్ అన్నారు. గురువారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ గడ్డపై యాత్రలు చేస్తూ వస్తున్న కాంగ్రెస్ నాయకులకు సూటిగా ప్రశ్నిస్తూ తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిర గాంధీ లంబాడీలకు రిజర్వేషన్లను కల్పించి 50 సంవత్సరాలు పూర్తి అవుతున్న సందర్భంగా గిరిజనతరుణోత్సవాల బస్సు యాత్ర నిర్వహించడం స్వాగతిస్తామని కానీ ఇందిరమ్మ పేరు చెప్పి లంబాడి బిడ్డల ఓట్లతో అధికారంలోకివచ్చిమూడుసంవత్సరాలుగా లంబాడీలకు జరిగిన అన్యాయంపైన సమాధానం చెప్పకుండా సర్వోత్సవాలు జరపడం కేవలం రాజకీయ లబ్ధి కోసమేనని.కాంగ్రెస్ యాత్రల నాయకులారా లంబాడి తండాల్లో అడుగు పెట్టే ముందు,మా 54 ఏళ్ల అన్యాయానికి బంజారా సమాజానికి క్షమాపణ చెప్పండి. అంబేడ్కర్ ఆశయాలను ఎస్సీ, ఎస్టీల హక్కులను కాలరాసిన చరిత్ర మీది. ఇకపై మోసపోవడానికి వీల్లేదు! మన హక్కుల రక్షణ కోసం మరో నంగారా భేరి మ్రోగిద్దాం!లంబాడీలకు సమాధానం చెప్పాల్సిన సమాధానాలు చేవెళ్లే డిక్లరేషన్ ఎన్నికల మేనిఫెస్టోలో గిరిజనులకు ఇచ్చిన హామీ అమలు చేశారా?పోడు భూములకు పట్టాలిచ్చారా?

గిరిజన విద్యార్థులకు అందాల్సిన స్కాలర్షిప్లు ఇచ్చారా?గిరిజనులకు అందాల్సిన సంక్షేమ పథకాలు ఇప్పటివరకు ఎందుకు రిలీజ్ చేయలేదు.గిరిజనతండాలాభివృద్ధికి ఇప్పటివరకు ఎన్ని నిధులు కేటాయించారు శ్వేత పత్రం విడుదల చేయాలని సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ కార్పొరేషన్ కు ఎన్ని నిధులు కేటాయించారో శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. తండాల గ్రామపంచాయతీలకు 25 లక్షల రూపాయలు స్పెషల్ డెవలప్మెంట్ ఫండ్ వెంటనే విడుదల చేయాలి ,కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో చేవెళ్ల డిక్లరేషన్ లో గిరిజనులకు ఇచ్చిన 12 హామీలను వెంటనేఅమలుచేసిచూపాలని తాండాలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా గుర్తించాలి సేవాలాల్ స్ఫూర్తితో ఐక్యంగా లంబాడీ బిడ్డలారా! మేధావులారా! యువతీ యువకులారా! ముందుకు సాగాలని తమ ఉనికి చాటాలని దశరథ్ నాయక్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సేవ్య నాయక్, శ్రీను నాయక్, మాజీ సర్పంచ్ శ్వేతా భూనాద్ ,మాజీ ఉపసర్పంచ్ రమణ, వార్డ్ సభ్యులు దేవా నాయక్ ,మాజీ వార్డు సభ్యులు భీమన్ నాయక్, నాయకులు కోట్యా నాయక్, శీను నాయక్ ,భిక్య నాయక్ ,సక్రు నాయక్ ,చందర్ నాయక్, పాల్గొన్నారు.

# చేనేత పారిశ్రామిక సహకార సంఘం మూడోసారి చైర్పర్సన్ గా వివి రమణ

- **సంఘంఅభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తాం**
- **చైర్పర్సన్ వివి రమణ**

**తొలిప్రభ, మానకొండూర్**



ఆముదాలపల్లి చేనేత పారిశ్రామిక సంఘం నూతన పాలకవర్గం

చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ లిమిటెడ్ ఆముదాలపల్లి అధ్యక్షునిగా, గ్రామ మాజీ సర్పంచ్ వెల్దండి వెంకటరమణ మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పెద్దపల్లి జిల్లా సహకార అధికారి, ఎన్నికల అధికారి అనూష మాట్లాడారు. గురువారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలోని ఆముదాల పల్లి గ్రామంలో గల చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి విక్రయ లిమిటెడ్ టీడీ డబ్ల్యు/5 కు ఆమదాలపల్లి కార్యాలయంలో ఎన్నికలు ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు నిర్వహించడం జరిగిందని, ఈ ఎన్నికల్లో సహకార సంఘం సభ్యులు హాజరై పాలకవర్గాన్ని మూడవసారి ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని, అధ్యక్షులుగా మూడవసారి ఏకగ్రీవంగా గ్రామ మాజీ సర్పంచ్ వెల్దండి వెంకటరమణ చైర్ పర్సన్, ఉపాధ్యక్షులుగా చందుపట్ల జనార్ధన్, కోశాధికారిగా వేముల రామ చంద్రం, డైరెక్టర్లుగా బైరి శ్రీనివాస్, బైరి రాజు, మంతెన సరోజన ఆడపు విజయ, బడుగు దామోదర్, శ్యామల సత్యనారాయణ ఏకగ్రీవంగా సభ్యులు ఎన్నుకున్నారు. సహకార సంఘం నియమ నిబంధన మేరకు ఎన్నికల ధ్రువకరణ పత్రాన్ని అందజేసినట్లు ఎన్నికల అధికారి అనూష తెలిపారు.

**నమ్మకాన్ని వమ్ము చేయను**

**సభ్యుల శ్రేయస్సు సంఘం ఎదుగుదలకు అహర్నిశలు కృషి చేస్తా**

**నూతన చైర్పర్సన్ వివి రమణ**

సంఘ సభ్యులు సంఘం లో తాను అందిస్తున్న సేవలను గుర్తించి మూడవసారి ఏకగ్రీవంగా నియామకము చేసినందుకు సంఘ సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని సంఘ సభ్యుల నమ్మకాన్ని మమ్ము చేయకుండా చేనేత కార్మికులకు, కుటుంబాలకు అండగా ఉంటూ చేనేత పారిశ్రామిక సహకార ఉత్పత్తి, విక్రయ సంఘం అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తానని, ప్రభుత్వం అందించే అన్ని సంక్షేమ పథకాలను సకాలంలో సభ్యులకు అందజేయడం సంఘం పాలకవర్గ ప్రథమ కర్తవ్యం. నేతన్నకు భరోసా పథకం కింద ప్రతి నేతన్నకు ఆర్థిక భద్రత, నేతన్న ఇన్సూరెన్స్ పథకం ద్వారా నేత కార్మికుల కుటుంబానికి భరోసా కల్పిస్తామని, సంఘం ఆధ్వర్యంలో ఉత్పత్తి నాణ్యత పరిమాణాలు పెంచడం అంతర్జాతీయ మార్కెట్ ప్రమాణాలకు అనుగుణంగా నాణ్యత మెరుగుపరచడం పై ప్రత్యేక శ్రద్ధ వహిస్తామని, ప్రింటింగ్ సౌకర్యాలు కల్పించడం కోసం ప్రభుత్వ ఎగ్జిబిషన్లు, ఆన్లైన్ విక్రయాలు, షోరూమ్లతో టైఅప్ చేయుటకు కృషి చేస్తామని,కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నేతన్నకు చేనేత, థ్రెడ్ సబ్సిడీ స్కీం, మడతల రాయితీ, వర్క్ షెడ్ నిర్మాణం వంటి అమలులో ఉన్న అన్ని పథకాలను 100 శాతం సద్వినియోగం సద్వినియోగం చేసుకొని సంఘాన్ని మరింత అభివృద్ధి బాటలోకి తీసుకపోవుటకు నూతన పాలకవర్గం సభ్యులు అండదండలతో ముందుకు సాగుతానని మూడోసారి ఏకగ్రీవంగా చైర్పర్సన్ గా నియామకమైన వివి రమణ అన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత పారిశ్రామిక సహకార సంఘం ఉద్యోగులు, సభ్యులు పాల్గొన్నారు.



# పరిగి 11వ వార్డులో (SIR) ఎన్యూమరేషన్ ఫార్మ్స్ పంపిణీ

**ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాల సేకరణ: బిల్ఓ, బిల్ఏ లు**

**తొలిప్రభ.పరిగి:**

భారత ఎన్నికల సంఘం, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ( SIR,) కార్యక్రమంలో భాగంగా పరిగి మున్సిపల్ 11వ వార్డు 207, 208 బూత్ల బిల్ఓ, బిల్ఏ ల ఆధ్వర్యంలో ఎన్యూమరేషన్ ఫార్మ్నను ఇంటింటికి తిరిగి పంపిణీ చేశారు.

ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి స్వచ్ఛమైన, పారదర్శకమైన ఓటరు జాబితా ఎంతో అవసరమని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ తమ వివరాలను పరిశీలించుకొని, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపుల కోసం ఎన్నికల అధికారులకు సహకరించాలని కోరారు. "మన ఓటు - మన హక్కు, మన బాధ్యత. ప్రజాస్వామ్య పరిరక్షణకు (SIR) కార్యక్రమానికి అందరూ సహకరించాలి" అని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ ఎండి ఏజస్ , బూత్ బిల్ఓ సక్కు , బిల్ఏ లు నాగరాజు, అనిల్ , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

- **కడ్తాల్ మండలం రావిచేడ్ శివారులో ఘటన**
- **మృతుడు న్యామతపూర్ గ్రామానికి చెందిన ఉడతల సిద్ధార్థ గా గుర్తింపు**

**తొలిప్రభ, కడ్తాల్ :**



రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ షాద్ నగర్ రహదారి రావిచేడ్ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గురువారం కడ్తాల్ సీఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలంలోని న్యామతపూర్ గ్రామానికి చెందిన ఉడతల సిద్ధార్థ (21) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై రావిచెడు గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న జెసిబి వాహనం బైక్ ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సిద్ధార్థ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కడ్తాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి తల్లి మున్ని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జెసిబి డ్రైవర్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ సైదిరెడ్డి మాట్లాడుతూ వాహనాలు రహదారులపై ప్రయాణించే క్రమంలో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.



# నూతన వధు వరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే

**తొలిప్రభ, మానకొండూర్**

నూతన వధు వరులను మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ గురువారం ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ మానకొండూర్ నియోజకవర్గం, లోని పలు మండలాల్లో జరిగిన వివాహ వేడుకలకు హాజరై నూతన వధూ వరులను ఆశీర్వదించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బత్తిని శ్రీనివాస్ గౌడ్, హుజురాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నాంపల్లి తిరుపతి, ఉప సర్పంచ్ల ఫోరం శంకరపట్నం మండలాధ్యక్షుడు గొట్టె మధు, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి మాజీ సర్పంచ్ గట్టు తిరుపతి, ఆయా మండలాలకు చెందిన సర్పంచులు, మాజీ సర్పంచులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కడ్తాల్: బస్సు యాత్రను అడ్డుకుంటున్న గిరిజనులు

# బస్సు యాత్రను అడ్డుకున్న గిరిజన నాయకులు

**కడ్తాల్, తొలిప్రభ :**

కడ్తాల్ మండల కేంద్రంలోని టోల్ ప్లాజా వద్ద..50 సంవత్సరాల గిరిజన స్వర్ణోత్సవ బస్సు యాత్రను కొందరు గిరిజనులు అడ్డుకున్నారు. గిరిజన సంఘాల సమస్యలను ప్రభుత్వం నెరవేర్చకుండా యాత్రలు చేయడం ఏమిటని ప్రశ్నించారు. టోల్ ప్లాజా వద్దకు చేరుకున్న బస్సుకు గిరిజన సంఘాల నాయకులు అడ్డు వెళ్లడంతో పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించారు. గిరిజన సంఘాల నాయకులు అశోక్ రాథోడ్, నరేష్నాయక్, రఘురాం రాథోడ్, గజా నాయక్, పవన్ రాథోడ్, సురేష్నాయక్ ఉన్నారు.




# డ్రగ్స్ వాడితే జీవితం నాశనం

- **చట్టపరంగా కఠిన చర్యలు తప్పవు**
- **ఉన్నత చదువులే లక్ష్యంగా ముందుకు సాగాలి**
- **యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు**
- **హుజురాబాద్ రూరల్ సీఐ శ్రీనివాస్**

**తొలిప్రభ, మానకొండూర్**

డ్రగ్స్ సేవిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని యువత విద్యార్థులు ఉన్నత చదివే లక్ష్యంగా ముందుకు సాగి ఉన్నత చదువులు చదివి కన్న తల్లిదండ్రులకు పుట్టిన గ్రామానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని హుజూరాబాద్ రూరల్ సిఐ బవి శ్రీనివాస్ యువతకు సూచించారు. గురువారం కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం ,శంకరపట్నం మండలం లోని మొలంగూర్ గ్రామంలో కేశవపట్నం ఎస్ఐ కట్కూరి శేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు యాంటీ డ్రగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు ఈ సదస్ కు ముఖ్యఅతిథిగా హాజరైన హుజురాబాద్ రూరల్ సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ యువత మత్తు పానీయాలకు బానిస అయితే పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన యువకుల జీవితాలు నాశనమవుతాయని, డ్రగ్స్ నిషేధిత గ్రామంగా ప్రతి ఒక్కరూ మత్తు పానీయాలను మాదకద్రవ్యాలను తరిమివేయాలని, గ్రామాల్లో డ్రగ్స్ మత్తు పదార్థాలు విక్రయిస్తే, సేవిస్తే కఠిన చర్యలు తప్పవని, డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించే అందుకే రాష్ట్ర ప్రభుత్వము ఈగల్ ఫోర్స్ ఏర్పాటుచేసి డ్రగ్స్ రహిత తెలంగాణగా తీర్చిదిద్దేందుకు అన్ని చర్యలు తీసుకుందని గ్రామాల్లో ఎవరైనా డ్రగ్స్ విక్రయిస్తే సేవిస్తే ఈగల్ టీం టోల్ ఫ్రీ నెంబర్ 1908, వాట్సాప్ నంబర్ 8712671111 నంబర్లకు సమాచారం అందించాలన్నారు. యువత ఉన్నత చదువులే లక్ష్యం, ముందుకు సాగి ఉన్నత చదువులు చదివి, ఉన్నత ఉద్యోగాలు సాధించి కన్న తల్లిదండ్రుల కలను నెరవేర్చి, పుట్టిన గ్రామానికి, కన్న తల్లిదండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పోలీస్ ఎం ఎం స్వామి గ్రామస్తులు పాల్గొన్నారు.



కన్నాపూర్ లో ఎస్ ఐ ఆర్ సర్వేను ప్రారంభిస్తున్న సర్పంచ్ రమా శ్రీనివాస్

# ఎస్ఐ ఆర్ ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి

**సర్పంచ్ రమా శ్రీనివాస్**


**తొలిప్రభ, మానకొండూర్**

ఎన్నికల కమిషన్ ప్రవేశపెట్టిన ఎస్ ఐ ఆర్ ప్రతి పౌరుడు వినియోగించుకోవాలని కన్నాపూర్ గ్రామ సర్పంచ్ నూనె రమా శ్రీనివాస్ అన్నారు. వారం కరీంనగర్ జిల్లా , మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలంలోని కన్నాపూర్ గ్రామంలో గ్రామ బి ఎల్ వో లు గాజుల కాంతా, కాటం రాజమణి, ఎన్నికల కమిషన్ ఎస్ ఐ ఆర్ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ రమా శ్రీనివాస్ హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రమా శ్రీనివాస్ మాట్లాడారు. రాజ్యాంగ బద్ధంగా ఓటు హక్కు వినియోగించుకొని ప్రక్రియలో భాగంగా కేంద్ర ఎన్నికల కమిషన్ ఎస్ఐఆర్ సర్వేను ప్రవేశపెట్టిందని ఈ సర్వేలో ఓటరు జాబితాలో తప్పులను సవరించడం చేర్పులు మార్పులు చేయడం జరుగుతుందని ప్రతి ఒక్కరూ ఎస్ఐఆర్ సర్వేన వినియోగించుకుని ఓటు హక్కు పొందాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బిజెపి సీనియర్ నాయకుడికి ఘన సన్మానం

**ఎమర్జెన్సీ వ్యతిరేకంగా జైలు కు రాజిరెడ్డి**

**తొలిప్రభ, మానకొండూర్**



బిజెపి సీనియర్ నాయకుడు పల్కల రాజిరెడ్డిని శాలులతో ఘనంగా బిజెపి పార్టీ ఆధ్వర్యంలో సన్మానం చేసినట్లు బిజెపి పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మాడ వెంకట్ రెడ్డి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా వెంకట్ రెడ్డి మాట్లాడారు. నాటి కాంగ్రెస్ ప్రభుత్వం1975 జూన్ 25 ఎమర్జెన్సీ ప్రకటించగా, వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితం గడిపిన, కరీంనగర్ జిల్లా, మానకొండూర్ నియోజకవర్గం, శంకరపట్నం మండలం, గద్దపాక గ్రామానికి చెందిన సీనియర్ బిజెపి నాయకులు పల్కల రాజిరెడ్డిని బిజెపి పార్టీ మండల శాఖ అధ్యక్షుడు ఏనుగుల అనిల్ ఆధ్వర్యంలో శాల్వాలతో ఘనంగా సన్మానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి అలివేలు సమ్మిరెడ్డి తదితరులు ఉన్నారు.

# రంగారెడ్డి జిల్లా కడ్తాల్, ఆమనగల్‌లో ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రకు ఘన స్వాగతం

- కడ్తాల్, ఆమనగల్‌లో ఘనంగా ఇందిరమ్మ బస్సు యాత్ర ప్రారంభం
- గిరిజన రిజర్వేషన్ల స్వర్ణోత్సవాలకు గిరిజనుల భారీ స్వాగతం
- ఎమ్మెల్యేలతో గిరిజన ప్రజల్లోకి ప్రభుత్వం
- డప్పు, కోలాటాలతో సందడి చేసిన సంక్షేమ యాత్ర
- పథకాలపై అవగాహన కోసం రాష్ట్రవ్యాప్తంగా బస్సు యాత్రలు




**తొలిప్రభ, కడ్తాల్ :**

గిరిజనుల రిజర్వేషన్ల స్వర్ణోత్సవ వేడుకల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర గురువారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ , ఆమనగల్ మండల కేంద్రాల్లో ఘనంగా ప్రారంభమైంది.ఈ బస్సు యాత్రలో పలువురు ఎమ్మెల్యేలు పాల్గొని గిరిజన ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, శంకర్ నాయక్, రామచందర్ నాయక్, బాలు నాయక్, మురళి నాయక్, రామ్ దాసు తదితరులు హాజరయ్యారు. గిరిజన రిజర్వేషన్లు అమలై 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా చేపట్టిన ఈ యాత్రకు స్థానిక గిరిజన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంబరాలు జరుపుకున్నారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలతో యాత్రకు స్వాగతం పలికారు. బస్సు యాత్ర ద్వారా గిరిజన సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలపై వివరించారు. గిరిజన రిజర్వేషన్ల స్వర్ణోత్సవాలు రాష్ట్ర వ్యాప్తంగా ఉత్సాహంగా జరుగుతున్న తరుణంలో ఈ బస్సు యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. అదే విధంగా మైసిగండి మైసమ్మ అమ్మ వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, గిరిజన సంఘాల నాయకులు హనుమ నాయక్, బిక్యా నాయక్, బీచ్యా నాయక్, కృష్ణ నాయక్, లక్పతి నాయక్, హీరా సింగ్ తదితరులు పాల్గొన్నారు.



# కడ్తాల్ కస్తూర్బా గాంధీ బాలికలకు సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన

**తొలిప్రభ, కడ్తాల్ :**

కడ్తాల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం విద్యార్థినులకు డ్రగ్స్, సైబర్ నేరాలు మరియు మహిళల భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కడ్తాల్ సీఐ సైదిరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, విద్యార్థినులు చదువుపై దృష్టి పెట్టి ఉన్నత లక్ష్యాలు సాధించాలని సూచించారు. క్రమశిక్షణ, మంచి అలవాట్లతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మహిళలు, బాలికల భద్రత కోసం షీటీమ్స్, డయల్ 100, చైల్డ్ హెల్ప్ లైన్ 1098 సేవలు 24/7 అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఏ సమస్య ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని సలహా ఇచ్చారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం దెబ్బతినడంతో పాటు కుటుంబ సమస్యలు, ఆర్థిక ఇబ్బందులు, నేరాలకు దారితీస్తుందని హెచ్చరించారు. పరిసర ప్రాంతాల్లో డ్రగ్స్ విక్రయం, వినియోగం గమనించినట్లయితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని భరోసా ఇచ్చారు.సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే లింకులు, కాల్స్‌ను నమ్మవద్దని, OTPలు, వ్యక్తిగత ఫోటోలు, వివరాలు ఎవరికీ పంచుకోవద్దని విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వరప్రసాద్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది మరియు విద్యార్థినులు పాల్గొన్నారు.



# అర్హులైన ప్రతి ఓటర్ కు న్యాయం జరగడమే ఎస్.ఐ.ఆర్ లక్ష్యం

**తహసిల్దార్ - కార్తీక్ కుమార్**

**తొలిప్రభ, కల్వకుర్తి**

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రంలో అర్హులైన ప్రతి ఓటర్ ఓటర్ల జాబితా నుండి తప్పిపోకుండా ప్రతి ఓటర్ కు న్యాయం జరగడమే ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) లక్ష్యంగా బిఎల్వోలు ముందుకు సాగాలని వెల్దండ తహసిల్దార్ కార్తీక్ కుమార్ అన్నారు. సర్ ప్రక్రియను కచ్చితంగా చేపట్టేందుకు బిఎల్ వోలు తప్పనిసరిగా ప్రతి ఇంటికి ప్రతి ఓటర్ ను సంప్రదించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా నుంచి ఓటర్లు తప్పిపోకుండా జాగ్రత్త వహించాలన్నారు. క్షేత్రస్థాయిలో బిఎల్వోలు పొరపాట్లు జరగకుండా సరిచూసుకోవాలని సూచించారు. కొత్త ఓటర్లను నమోదు చేసుకొని, డబుల్ ఓటర్ల జాబితాలోని సమీప బంధువులను గుర్తించి మ్యాపింగ్ చేసే క్రమాన్ని వీఆర్వో బాధ్యతగా చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్.ఐ శంకర్ నాయక్, బిఎల్ వో మాసమ్మ, పంచాయతీ కార్యదర్శి గిరి గౌడ్, వార్డు సభ్యులు గుద్దేటి కిష్టాల్, సీనియర్ నాయకులు చిమ్ముల తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతుభరోసా దరఖాస్తు చేసుకోండి

- వ్యవసాయ అధికారి శ్రావణ కుమారి
- చింతపల్లి మండలంలో స్వీకరణ మొదలు

**తొలిప్రభ. చింతపల్లి**



రైతుభరోసా పథకం వానాకాలం 2026 27 దరఖాస్తులపై మండల వ్యవసాయ అధికారిణి ఏవో శ్రావణ కుమారి కీలక సూచనలు చేశారు.చింతపల్లి మండలంలో రైతుభరోసా పథకం దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని ఏవో శ్రావణ కుమారి తెలిపారు. ఈ నెల 15 నాటికి కొత్తగా పట్టాదార్ పాసు పుస్తకం పొందిన రైతులు వెంటనే తమ గ్రామ రైతు వేదిక వద్ద ఉన్న వ్యవసాయ అధికారిని సంప్రదించి దరఖాస్తు ఇవ్వాలని ఆమె కోరారు. పథకం ద్వారా లబ్ధి పొందుతున్న రైతులలో బ్యాంకు లెక్కల వివరాలు మార్చుకోవాల్సిన వారు తప్పనిసరిగా వ్యవసాయ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని రైతులకు ఆమె సూచించారు.

**దరఖాస్తుతో పాటు జత చేయాల్సినవి**

నింపిన దరఖాస్తు పత్రం , పట్టాదార్ పాసు పుస్తకం కాగితపు జిరాక్స్ , బ్యాంకు పాస్ బుక్ జిరాక్స్,రైతు వేదికల వద్ద విధులు నిర్వహిస్తున్న సంబంధిత ప్రాంత వ్యవసాయ అధికారులకు ఇవ్వాలని ఏవో శ్రావణ కుమారి తెలిపారు.

# జడ్పీహెచ్ఎస్‌లో పదో తరగతి సప్లిమెంటరీ ఫలితాల్లో ఉత్తీర్ణత

**తొలిప్రభ, కడ్తాల్ :**

పదో తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ ఫలితాల్లో స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. పాఠశాల నుండి 23 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 21 మంది ఉత్తీర్ణత సాధించారు. గతంలో ఫెయిలైన విద్యార్థులకు అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్ష రాసే అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు 100% ఉత్తీర్ణతతో అందరినీ ఆశ్చర్యపరిచారు.ఈ అద్భుత ఫలితాలకు కారణం ఉపాధ్యాయుల నిబద్ధత అని పాఠశాల ప్రధానోపాధ్యాయులు జంగయ్య అన్నారు. వేసవి సెలవుల్లో కూడా ప్రత్యేక తరగతులు నిర్వహించి విద్యార్థులను చదివించిన బోధనా సిబ్బందికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.ఇప్పుడు ఉత్తీర్ణులైన విద్యార్థులు కూడా రెగ్యులర్ విద్యార్థుల మాదిరిగానే ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ITI వంటి కోర్సుల్లో ప్రవేశం పొందేందుకు అర్హులని ప్రధానోపాధ్యాయులు స్పష్టం చేశారు.

# ఉప సర్పంచ్‌ల చెక్ పవర్ పై ఉన్న ఊహా గానాలను ప్రభుత్వము ఖండించి స్పష్టమైన ప్రకటన చేయాలి

- చెక్ పవర్ రద్దు చేస్తే ఆందోళనలు తప్పవు
- కరీంనగర్ జిల్లా ఉపసర్పంచ్‌ల ఫోరం కోఆర్డినేటర్ విజయ్ కుమార్

**తొలిప్రభ, మానకొండూర్**



ఉప సర్పంచ్ ల చెక్ పవర్ రద్దు చేస్తారని రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న ఊహాగానాలపై, రాష్ట్ర ప్రభుత్వం ఖండించి, స్పష్టమైన ప్రకటన చేయాలని, ఉప సర్పంచ్ ల చెక్ పవర్ రద్దు చేస్తే ఆందోళన తప్పవని కరీంనగర్ జిల్లా ఉప సర్పంచ్ ల ఫోరం కోఆర్డినేటర్ ఆకుబత్తిని విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. గురువారం హైదరాబాద్‌లోని ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన హలో ఉప సర్పంచ్ - చలో హైదరాబాద్ కార్యక్రమంలో కేశవపట్నం ఉప సర్పంచ్, కరీంనగర్ జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం కోఆర్డినేటర్ ఆకుబత్తిని విజయ్ కుమార్ పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా విజయ్ కుమార్ మాట్లాడుతూ, ఉప సర్పంచ్‌ల చెక్ పవర్‌ను రద్దు చేస్తున్నారనే వార్తలను తెలంగాణ ప్రభుత్వం వెంటనే అధికారికంగా ఖండించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉప సర్పంచ్‌లు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి, వారి అధికారాలు, బాధ్యతలకు తగిన గుర్తింపు కల్పించాలని కోరారు.అదే విధంగా, ఉప సర్పంచ్‌ల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించి,గ్రామాభివృద్ధిలో ఉప సర్పంచ్‌ల పాత్రను మరింత బలోపేతం చేసే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఉప సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే భవిష్యత్తులో మరింత ఉధృతంగా ఉద్యమిస్తామని విజయ్ కుమార్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ క్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఉప సర్పంచ్ లు పాల్గొన్నారు.



# పల్లెల్లో ప్రారంభమైన ఎస్ఐఆర్ సమగ్ర సవరణ

**తొలిప్రభ , చింతపల్లి**

తెలంగాణ రాష్ట్రంలో ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం గురువారం చింతపల్లి మండలంలోని తీదేడు గ్రామంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా తీదేడు గ్రామంలోని పోలింగ్ బూత్ నెంబర్. 52, 53, 54, 55, 56 పరిధిలో ఎన్యుమరేషన్ పత్రాలను బి ఎల్ ఓ చింతకుంట్ల అంజమ్మ, గంటల చంద్రయ్య సూపర్ వైజర్ రజిత, ఓటర్లకు పంపిణీ చేశారు. నెలవలపల్లి , దేన్య తండాలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్ యాదవ్ పోలింగ్ బూత్ లోని ఏన్యునరేషన్ పత్రాలను పత్రాలను పరిశీలించారు . ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బి ఎల్ ఓ లు వెంకటేశ్వర్లు, గుణమోని శ్రీనివాస్, గ్రామ ఓటర్లు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మహిళల సంక్షేమ అభివృద్ధి లక్ష్యం

**మండల కోఆర్డినేటర్ మమత లక్షణ స్వామి**

**తొలిప్రభ, కల్వకుర్తి**



నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల మహిళా సాధికారత కోఆర్డినేటర్ గా కంటోన్ పల్లి గ్రామ సర్పంచ్ మమత లక్ష్మణ స్వామి నియమితులయ్యారు. ఈ మేరకు హైదరాబాదులో బుధవారం జరిగిన సమావేశంలో మమతను నియమిస్తూ మహిళ సాధికారత రాష్ట్ర వ్యవస్థాపకురాలు ఝాన్సీ రెడ్డి, డైరెక్టర్ పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళల సాధికారత, సమాజంలో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షత, మహిళల హక్కుల సాధన కోసం పనిచేయడం జరుగుతుందని ఆమె స్పష్టం చేశారు. మహిళల సంక్షేమ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మమత తెలిపారు. కోఆర్డినేటర్ గా నియమించినందుకు ఝాన్సీ రెడ్డి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డిలకు ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈ నియామకంపై మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# బాధితురాలికి ఎమ్మెల్యే కసిరెడ్డి ఆర్థిక సహాయం



**తొలిప్రభ, కల్వకుర్తి**

నాగర్ కర్నూల్ జిల్లా కల్వకుర్తి నియోజకవర్గం వెల్దండ మండల కేంద్రానికి చెందిన గుద్దేటి పారిజాత అనారోగ్యంతో బాధపడుతున్న విషయాన్ని వే టు న్యూస్ డయల్ యువర్ ఎమ్మెల్యే కాల్ ద్వారా తెలుసుకున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ మట్ట వెంకటయ్య గౌడ్ బాధితురాలికి రూ.5000 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు నెంబర్ గుద్దేటి కిష్టాల్ , ముదిగొండ కవిత రమేష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తిరుపతి రెడ్డి, సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, ఈదులపల్లి శ్రీనివాసులు, కొమ్ము అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# ఐఎస్ సదన్ ఏటీఎం చోరీ కేసులో ట్విస్ట్.. డబ్బుతో పరారైంది తండ్రీకొడుకులే

**తొలిప్రభ, హైదరాబాద్ :**

హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్ ఏటీఎం చోరీ ఘటనను పోలీసులు ఛేదించారు. ఏటీఎం క్యాష్ వ్యాన్ డ్రైవర్ శ్రీనివాస్, అతని ఇద్దరు కుమారులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. సీసీపుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. కాగా, ఏటీఎంలకు నగదు సరఫరా చేసే క్యాష్ వాహన డ్రైవర్ రూ.17 లక్షల నగదుతో పరారైన సంఘటన మంగళవారం ఐఎస్ సదన్ పీఎస్ పరిధిలో కలకలం రేపింది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సాయిప్రకాశ్‌గౌడ్ కథనం ప్రకారం.. ఎస్బీఐ బ్యాంక్ క్యాష్‌ను ఏటీఎంలలో డిపాజిట్ చేసే టీమ్ పోస్ ఏజెన్సీలో కరీంనగర్ జిల్లా జగిత్యాలకు చెందిన శ్రీనివాస్ 4 నెలల క్రితం డ్రైవర్‌గా ఉద్యోగంలో చేరి ప్రస్తుతం బాలానగర్‌లో నివాసముంటున్నాడు. మంగళవారం మధ్యాహ్నం 12:30 గంటల ప్రాంతంలో సంతోష్‌నగర్‌రెయిన్ బజార్ ప్రధాన రహదారిపై ఉన్న ఎస్బీఐ ఏటీఎంలో నగదు డిపాజిట్ చేయడానికి వచ్చారు. ఎస్బీఐ బ్యాంక్ ఏటీఎంలో నగదు డిపాజిట్ చేయడానికి వెళ్తున్న సమయంలో ముందుగా వేసుకున్న ప్రథకం ప్రకారం వాహన డ్రైవర్ శ్రీనివాస్ అక్కడికి ముందుగానే పిలిపించుకున్న బైక్‌పై అదను చూసి రూ.17లక్షలు ఉన్న బ్యాగ్‌ను తస్కరించి పరారయ్యాడు. వెంటనే టీమ్ పోస్ ఏజెన్సీ సంస్థ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు ఐఎస్ సదన్ పీఎస్ ఎస్ఐ సాయి ప్రకాశ్‌గౌడ్ స్పాట్‌కు చేరుకొని సీసీ పుటేజ్ , వివరాలను సేకరించారు.